

# అమెరి'కలకలం' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



9

# మాలతీ చందూర్ గారి మధుర స్మృతులు

మాలతీ చందూర్ గారు తమ 84 వ ఏట ఆగస్ట్ 21, 2013 నాడు కేన్సర్ వ్యాధితో మరణించారు అనే వార్త టీవీ లో చూడగానే ఏం చెయ్యాలో, ఎవరితో చెప్పుకోవాలో, అసలు ఎలా 'ఫీల్'' అవ్వాలో కూడా తెలియ లేదు..

ఆ రోజు నాకు యింకా బాగా గుర్తు. సుమారు పాతిక సంవత్సరాల క్రితం నేను ఎందుకో మద్రాసు వెళ్ళినప్పుడు సెంట్రల్ స్టేషన్ లో దిగగానే ముందుగా ఆవిడే జ్ఞాపకం వచ్చారు. ఎందుకంటే, అప్పుడూ, ఇప్పుడూ, ఎల్లప్పుడూ చెన్నపట్నం, మద్రాసు, మెడ్రాస్, చెన్నై ఇలా ఎన్ని పేర్లతో పిలిచినా ప్రతీ చిన్న, చితకా తెలుగు రచయితకీ, సాహిత్యాభిమానికీ, "ప్రమదావనం" లో ఆవిడ ఇచ్చిన సలహాలలో ఎవరికీ చెప్పుకోలేని తమ జీవిత సమస్యలకి సమాధానాలు వెతుక్కునే అసంఖ్యాక తెలుగు మధ్య తరగతి కుటుంబీకులకీ, కొత్త కొత్త వంటలు చేసి భర్తనీ, కుటుంబాన్నీ మెప్పిద్దాం అని తపన పడే తెలుగు ఆడపడుచులకీ, ప్రఖ్యాత ఇంగ్లీషు, తమిళ సాహిత్య తెలుగు అనువాదాలని చదువుకుని ఆస్వాదించే వారికీ ఎల్ల వేళలా గుర్తొచ్చే ఏకైక సాహితీ వేత్త, పూర్తి స్థాయి తొలి తెలుగు మహిళా రచయిత్రి శ్రీమతి మాలతీ చందూర్ గారే! ఆవిడ ఉనికి మద్రాసులోనే అని అందరికీ తెలిసినదే కాబట్టి ఆవిడని కలుసుకోవాలని ఉబలాట పడి ఆవిడకి ఫోన్ చేసాను. యధాప్రకారం ఆవిడ మామయ్య మరియు భర్త అయిన చందూర్ గారు ఫోన్ తీసారు. ఆయన పూర్తి పేరు చందూరి నాగేశ్వర రావు అయినా, ప్రపంచానికి ఆయన ఎన్. ఆర్. చందూర్ గానే తెలుసు. ఆ ఆధునిక బాణీ లోనే ఆవిడ కూడా అందరూ టక్కున గుర్తుపెట్టుకునే మాలతీ చందూర్ గా పేరులో కూడా కొత్త వరవడి సృష్టించుకున్నారు. "ప్రమదావనం" అనే శీర్షిక పేరు కూడా అలాంటిదే. చందూర్ గారు ఫోన్ తీసుకుని అసలు నువ్వు ఎవరు, ఎందుకు ఫోన్ చేసావు, మాలతి గారితో నీకు పనేమిటి, ఇంటర్వ్యూ కావాలా, ఫోటో కావాలా, నీ పత్రికకి వ్యాసం కావాలా, సన్మానం చేస్తావా మొదలైన ప్రశ్నలు పదే, పదే అడిగారు. ఈ "గోడ"

దూకితే కానీ ఆ "బంగారు పళ్ళాన్ని" చేరుకోలేం అని నాకు అప్పుడే అర్థం అయిపోయి, నేను ఒక సాధారణ రచయితని అనీ, కేవలం తెలుగు సాహిత్యం మీద అభిమానం ఉండడం మాత్రమే మాలతీ చందూర్ గారిని కలుసుకోడానికి నా కనీస అర్హతగా ప్రకటించుకుని ఆయనకి నా ప్రవర చెప్పుకున్నాను. ఆ వివరణలో ఎన్నార్ గారికి నేను ఎన్నారై అని తెలిసి కాస్త చల్లబడి "రేపు పొద్దున్న రండి" అని వారింటికి సాదరంగా ఆహ్వానించారు. "ఒక గంట కంటే మాలతి గారికి టైం ఉండదు." అని హెచ్చరించారు.

ఆ మర్నాడు మద్రాసు, మైలాపూరులో కచేరి రోడ్ కి వెతుక్కుంటూ వెళ్ళాను. ఆ మూడు అంతస్తుల ఇల్లు "చరిత్ర" వాసన తో రెండో ప్రపంచ యుద్ధం కాలం నాటిది అనిపించింది. ఇంటి ముందు తుప్పు పట్టి పోయినా గంభీరంగానే ఉన్న పురాతన కాలం నాటి చక్రాల కుర్చీ ఉంది. దాన్ని చూడగానే మా చిన్నప్పుడు , కాకినాడలో మా అదే "వాసన" తో ఉండే మా తాత గారి గుర్రబ్బండి అవశేషాలు గుర్తుకొచ్చి సొంత ఇంటికి వచ్చిన భావన కలిగింది. గుమ్మం దగ్గర చూడ గానే తెల్లటి వస్త్రధారణతో, స్వచ్ఛమైన ముఖారవిందంతో అప్పటికే డభ్భై ఏళ్ళు పైబడ్డ చందూర్ గారు నన్ను లోపలికి ఆహ్వానించారు. పైన మెట్ల మీద నుంచి సాదా చీర కట్టులో, చేతిలో అరడజను కాగితాలతో మాలతి గారు కిందకి దిగి నవ్వుతూ నన్ను పలకరించారు. అప్పటి వరకూ ఎవరైనా గొప్ప వాళ్ళు అమెరికా వస్తే కలుసుకోవడమే కానీ, నేను ఇండియా వెళ్ళినప్పుడు అక్కడ వారింట్లోనే ప్రముఖుల్ని కలుసుకోవడం నాకు అలవాటు లేదు. అలాటి నా తొలి అనుభవాలలో మాలతీ చందూర్ గారిని వారింట్లోనే కలుసుకోవడం చాలా ముఖ్యమైనది. మొదట ఐదు నిముషాల సేపు ఆవిడ నన్ను "మీరు" అని సంబోధించినా, నా కోరిక మీద ఎంతో సంతోషంగా నన్ను 'నువ్వు" అని పిలుస్తూ "నాకు ఇలా ఉండే వాళ్ళంటేనే ఇష్టం" అని సంబర పడ్డారు. అప్పటి నుంచీ నాతో ఎప్పుడూ "నీ మొహం, నీ తలకాయ్, అమెరికా బుద్ధులు " అంటూ ఎంతో చనువుగా ఉండే వారు. చందూర్ గారు మటుకు నన్ను ఎప్పుడూ "మీరు" అని తప్ప సంబోధించే వారు కాదు. ఆ రోజు నేను వారింట్లో ఉన్నంత సేపూ ఆవిడ కోరిన కోరిక ఒకటే..."మీ అమెరికా లో ఉన్న మహిళ లకి ఉన్న సమస్యల గురించి ప్రమదావనం శీర్షిక కి ప్రశ్నలు పంపించమని చెప్పండి." ఆ శీర్షిక ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మహిళలకి వేదిక కావాలనేది ఆవిడ కోరిక. "అమెరికాలో ఉన్న తెలుగు మహిళలకి ఆ అవసరమూ, వారి ప్రత్యేక సమస్యలకి మీరు ఇక్కడ నుంచి చెప్పగలిగేదీ ఏమీ ఉండదు" అని నేను చెప్పిన సమాధానం వారిద్దరికీ నచ్చ లేదు. కానీ, చందూర్ గారు సైలెంట్ పార్టనర్ గా మాలతి గారు గల, గలా నవ్వుతూ అన్ని విషయాల మీదా ధాటీగానే మాట్లాడడం నాకు యింకా గుర్తే! అదే వారి ట్రేడ్ మార్క్. హ్యూస్టన్ వచ్చిన వారిని ఆదరించడం తప్ప అప్పటికింకా ఇండియా నుంచి సాహితీ వేత్తలని అమెరికా ఆహ్వానించడం లాంటి పనులకి నేను పూనుకోలేదు.

ఆ తరువాత మాలతీ చందూర్ గారిని నేను అనేక సార్లు కలుసుకున్నా, ఫోన్ లో ఎన్నో సార్లు మాట్లాడుకున్నా మూడు సంఘటనలు నా జీవితంలో చాలా ప్రధానమైనవి. అందులో రెండు మాలతీ చందూర్ గారి చేతుల మీదుగా మద్రాసు లో జరిగిన వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ప్రచురించిన రెండు పుస్తకావిష్కరణలు. మొదటి ఆవిష్కరణ 2002 లో ఇండియాలో మా మొదటి ప్రచురణ "అమెరికా తెలుగు కథానిక" . ఆ సభ పప్పు వేణు గోపాల రావు గారి ఆధ్వర్యంలో ఆయన అధ్యక్షులుగా ఉన్న అమెరికన్ ఇన్స్

స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ స్టడీస్ ఆఫీసులో జరిగింది. మద్రాసు నగరంలో ఉన్న ప్రముఖ సాహితీ వేత్తలలో చాలా మందిని ఆ సభలో నేను మొదటి సారిగా కలుసుకున్నాను.

అప్పుడే నేను మొదటి సారిగా మాలతీ చందూర్ గారిని అమెరికా రమ్మని ఆహ్వానించినప్పుడు కొన్ని ఆసక్తికరమైన విషయాలు తెలిసాయి. మొదటిది ఎప్పుడు, ఎక్కడికి వెళ్ళినా..ఆఖరికి కూరలు కొనుక్కోడానికి మార్కెట్ కి వెళ్ళినా దంపతులిద్దరూ కలిసే వెళ్తారు. ఇది పరవాలేదు కానీ, ప్రపంచవ్యాప్తంగా అంతటి పేరు ప్రఖ్యాతులున్న చందూర్ దంపతులు జీవితంలో బహుశా మూడు, నాలుగు సార్లు మాత్రమే విమాన ప్రయాణం చేశారుట. అదైనా, కూడా ఎవరో పక్కన ఉండి తీసుకెళ్ళాలి. "అవన్నీ నాకు తెలియదు. మీరు ఏమైనా సరే అమెరికా రావాలి. మా దేశం ఎలా ఉంటుందో చూడాలి" అని నేను అనగానే "నీ ఆత్మీయత, అతిదులని గౌరవంగా చూసే పద్ధతి మేము చాలా మంది చెప్పగా విన్నాం. ఇది వరకు మమ్మల్ని తానా వారు పిలిచారు కానీ వారికి మా కోరికలు గొంతెమ్మ కోరికలుగా కనపడ్డాయి." అంటూ "చూద్దాంలే. ఏదైనా మంచి సాహితీ సభ ఉంటే ఆలోచిద్దాం" అని దాట వేశారు. తానా వారు ఎప్పుడు పిలిచారో, ఎవరు పిలిచారో, ఎలా పిలిచారో నాకు తెలియదు కానీ చందూర్ దంపతులకి ఆ ఆహ్వానం అంత రుచించినట్టుగా లేదు.


పుస్తకాన్ని ఆవిష్కరించిన మాలతీచందూర్. చిత్రంలో పప్పు వేణుగోపాలరావు, బీఎస్సార్ కృష్ణ, రచయిత చిట్టెన్‌రాజు, ఓంకార్ ఉన్నారు

ఇక రెండోది అయిన నా మొదటి కథా సంపుటి "అమెరికామెడీ కథలు" పుస్తకావిష్కరణ నాకు వ్యక్తిగతంగా చాలా గర్వ కారణం. ఎందుకంటే, ఈ సభ నిర్వహించినది కూడా పప్పు వేణు గోపాల రావు గారే అయినా, నిర్వహించిన సంస్థ పొట్టి శ్రీరాములు స్మారక సమితి. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమర జీవి పొట్టి శ్రీరాములు గారు అసువులు బాసిన ప్రాంగణం పవిత్రతని, చారిత్రక ప్రాధాన్యతని కాపాడడానికి ఏర్పడిన పొట్టి శ్రీరాములు స్మారక సమితి కి మాలతీ చందూర్ గారే అధ్యక్షులు. ఆ బాధ్యతలు ఆవిడ ఎంతో చిత్తశుద్ధి తో నిర్వహిస్తూ ప్రతీ సంవత్సరమూ అంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవం జరుపుతూ, ఆవిడ చొరవ తో నిర్మించబడిన సభాస్థలి లో ఆవిడ చేతుల మీదుగా నా "అమెరికామెడీ కథలు" కథా సంపుటి ఆవిష్కరణ జులై 29, 2006 నాడు జరిగింది. ఇందుతో ఆ నాటి "ఈనాడు" పత్రిక లో పడిన ఫోటో జతపరుస్తున్నాను. ఆ సభలో మాలతి గారు నా మీద చూపించిన వ్యక్తిగత అభిమానం, ఒక హాస్య రచయితగా నాకు ఇచ్చిన గుర్తింపు, నా పట్ల చూపిన చనువు ఈ జన్మలో మర్చిపోలేను.

ఇక్కడ చిన్న పిట్ట కథ ఏమిటంటే సభ జరిగే రోజు ఉదయం నేను వారింటికి వెళ్ళగానే "నీ పుస్తకం బాపు-రమణల కి అంకితం ఇచ్చావు కదా. వాళ్ళిద్దరూ వస్తున్నారా?" కళ్ళతో చిలిపి నవ్వు నవ్వుతూ అడిగారు మాలతీ చందూర్ గారు. "మాములుగా అయితే ఏమో కానీ.. మీరే అన్నారుగా అంకితం పుచ్చుకోడానికి గేరంటీగా వస్తాం అన్నారండీ " అన్నాను. ఆవిడ ఫేడీల్ మని గల, గల నవ్వేసి "నువ్వెక్కడి అమెరికా అమాయకుడివయ్యా. వాళ్ళు రారు అని నేను గేరంటీ ఇస్తాను. రమణ మెట్లు ఎక్కలేను అంటాడు. బాపు ఆఖరి క్షణంలో పిలిచి జనగండం అంటాడు." అన్నారు. "పోనీ లెండి. వాళ్ళిద్దరూ రాకపోతే ఇక మీరే హీరోయిన్ ఆ సభలో" అన్నాను. సరిగ్గా అలాగే జరిగింది. ఆ సభానంతరం "అమెరికా కొడుకా" అని నన్ను మొదటిసారిగా, సరదాగా మాలతీ చందూర్ గారు సంబోధించారు. చందూర్ దంపతులకి పిల్లలు లేని కారణాన వారు పప్పు వేణు గోపాల రావు గారు, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, ఘంటసాల రత్నకుమార్ మొదలైన వారిని పుత్ర సమానులుగా చూసే వారు అని తెలిసిన నాకు ఆవిడ నన్ను కూడా ఆ కోవలోకి చేర్చుకోవడం మహదానందాన్ని కలిగించింది.

అన్నట్టు "ఈనాడు" అంటే `జ్ఞాపకం వచ్చింది. గత ఏప్రిల్, 2012 లో "ఈ నాడు " పత్రిక "అద్దెకు అమర జీవి" అనే మకుటంతో ఆర్ధిక ఇబ్బందుల వలన పొట్టి శ్రీరాములు స్మారక మందిరాన్ని అద్దెకు ఇస్తున్నట్టు ఒక వార్తా కథనాన్ని ప్రచురించింది. దానికి అధ్యక్షురాలైన మాలతీ చందూర్ మీడియా ప్రతినిధులని పిలిచి "తాము రాసినదే జర్నలిజం అనుకుంటున్నారా. ప్రచరించే ముందు నిజానిజాలు తెలుసుకో అక్కర లేదా" అని విరుచుకు పడ్డారు. అవసరం అయితే నిర్మొహమాటంగా, నిష్కర్ష గా మాట్లాడడానికి ఆవిడ ఎప్పుడూ వెనకాడ లేదు.

ఇక 2009 ఫిబ్రవరిలో నిర్వహించిన రెండవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు సందర్భంగా మేము తలపెట్టిన అంతర్జాతీయ కథల పోటీకి గొల్లపూడి మారుతీ రావు గారితో బాటు మాలతీ చందూర్ గారిని న్యాయ నిర్ణేత గా ఆహ్వానించడానికి జనవరిలో మద్రాసు వెళ్ళాను. గొల్లపూడి గారు తక్షణమే అంగీకరించి, "రండి, ఇద్దరం కలిసే మాలతీ చందూర్ గారి ఇంటికి వెడదాం" అన్నారు. వారిద్దరూ అనేక సంవత్సరాలగా మద్రాసులోనే ఉంటూ అనేక సభలో కలుసుకుంటూనే ఉన్నా, గొల్లపూడి గారు మాలతీ చందూర్ గారి ఇంటికి వెళ్ళడం అదే మొదటి సారి అని అక్కడికి వెళ్ళాక తెలిసింది. ఇక చందూర్ దంపతులు ఇద్దరూ చాలా సంతోష పడిపోయి "మొత్తానికి మా అమెరికా కొడుకు వలన మీరు మా ఇంటికి వచ్చారు" అని మా ఇద్దరికీ తమ ఇంటి మూడు అంతస్తులూ వివరంగా చూపించారు.

కింద అంతస్తులో చందూర్ గారి ఆఫీసు...అంటే మాలతి గారి మాటల్లోనే చెప్పాలంటే "నేను రాసిన కాగితాలన్నీ ఆయన బల్ల మీద విసిరేస్తాను. మిగిలిన పనులన్నీ ఆయనే చూసుకుంటారు." అలా అన్ని పనులూ...ప్రూఫ్ రీడింగ్ నుంచి, పత్రికలకి పంపించే దాకానూ, "జగతి" పత్రిక నిర్వహణ ఆ గది లోంచే జరుగుతుందన మాట. రెండో అంతస్తులో ఒక గదిలో ఉన్న మాలతి గారి అక్క గారిని మాకు పరిచయం చేస్తూ "ఆవిడని చూసుకోమని ఇంకెవరికైనా అప్పజెప్పేసి నేను ఊళ్లు, దేశాలు తిరగను" అని ఖండితంగా చెప్పారు.

ఆ ఇంటి కింద రెండు అంతస్తులూ పుస్తకాలమయం కావడం పెద్ద విశేషం ఏమీ కాదు కానీ. పైన డాబా మీద మాలతీ చందూర్ గారు చిన్న గార్డెన్ వేసుకుని అందులో దొండ కాయలు, వంకాయలు పండించుకోవడం చూసి నాకు భలే ఆశ్చర్యం వేసింది. అది చూసి "మీ వంటల పుస్తకం చూడకుండా నేను అమెరికాలో ఎప్పుడూ వంట చెయ్యలేదు మాలతి గారూ. అయినా మీకు అన్ని రకాల వంటలు ఎలా నేర్చుకున్నారు? " ఆవిడ ఎప్పటి లాగే గల, గలా నవ్వేసి "నీకో రహస్యం చెప్పనా?. నేను అసలు వంట చెయ్యను. దానికి టైమేదీ?". అన్నారు. "మరి అంత పెద్ద వంటల పుస్తకం ఎలా రాశారు?" అంటే..."అది చిన్నప్పుడు కదా. మా ఇంట్లో అందరూ చేస్తున్నవి చూసి, నా సొంతం కొంత కలిపి అక్షర బద్ధం చేసాను. అంతే." అని నిజాయితీగా ఒప్పేసుకున్నారు మాలతీ చందూర్ గారు. నిజానికి, అది పూర్తిగా నిజం అని నేను అనుకోను.

ఆ రోజు చందూర్ గారి ఇంట్లో మేము నలుగురం మూడు గంటల సాహిత్య గోష్టిలో గొల్లపూడి గారు తమ కవితలు కొన్ని వినిపించారు. నేను వచ్చిన అసలు పని ..అంటే కథల పోటీకి న్యాయ నిర్ణేత గా ఉండమని గొల్లపూడి గారూ, నేనూ కోరుతూ వివరాలు చెప్పగానే చందూర్ గారు స్వతస్సిద్ధమైన పద్ధతిలో "మీ లెటర్ హెడ్ మీద ఉత్తరం వ్రాయండి ఆలోచించుకుని చెప్తాం" అన్నారు. మేము వ్యక్తిగతంగా వచ్చి కోరిన అంత చిన్న కోరికకి ఈ స్పందన ఏమిటా అని కొంచెం ఆశ్చర్యపోయినప్పటికీ నేను వారు అడిగినట్టు అధికారికంగా మా విన్నపాన్ని తరువాత పంపించాను. "మాకు అలాంటివన్నీ వద్దండీ. అనవసరంగా వాదోపవాదాలకి దారి తీసే అవకాశం ఉంది." అన్నారు చందూర్ గారు అని ఆ తరువాత గొల్లపూడి గారు ఫోన్ చేసి చెప్పారు. విశేషం ఏమిటంటే, నా లిఖిత పూర్వకమైన ఉత్తరానికి ఇంచుమించు అవే మాటలతో మాలతి గారు న్యాయ నిర్ణేతగా ఉండడానికి అంగీకరించ లేదు అని సమాధానమూ, నేను వారింటికి వెళ్ళిన విశేషాలనీ, ఆ రోజు గొల్లపూడి గారు చదివిన కవితలనీ ప్రచురించిన "జగతి" పత్రిక మూడు కాపీలు నాకు చందూర్ గారు అమెరికా పంపించారు. అవి నాకు చేరేటప్పటికి ఆ కథల పోటీలు అయిపోయి నెల దాటిపోయినా, ఆ విధమైన స్పందన వారి నిబద్ధతకి నిదర్శనంగానే నేను భావిస్తాను.

నేను ఎన్. ఆర్. చందూర్ గారిని నేను చూడడం అదే ఆఖరి సారి- 2009 లో. జనవరి 2011 లో తన 95 వ ఏట మాలతి గారిని అన్ని విధాలుగానూ ఏకాకిని చేసి చందూర్ గారు పరమపదించారు. అప్పటి నుంచీ ఆవిడ ఎప్పుడూ కోలుకోలేదు కానీ ఆ ఏడు అక్టోబర్ లో ..అంటే చందూర్ గారు పోయిన పది నెలలకే నా మాట మన్నించి ఆవిడ హైదరాబాద్ వచ్చి మా సత్కారం అందుకోవడం నిజంగా నా అదృష్టమే. అప్పటి ఫోటో ఇందుతో జతపరుస్తున్నాను. అక్టోబర్ 2011 లో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 17వ వార్షికోత్సవం సందర్భంగా మేము అప్పటి దాకా కేంద్ర సాహిత్య ఎకాడెమీ బహుమతి పొందిన తెలుగు రచయితలు అందరినీ (సుమారు 18 మంది) ఒకే వేదికపై గుర్తించి సత్కరించిన అపూర్వ చారిత్రక కార్యక్రమానికి మాలతీ చందూర్ గారు చెన్నై నుంచి ప్రత్యేకంగా వచ్చారు. అప్పుడు ఆవిడ మాట్లాడుతూ "నా హృదయ నేత్రి నవలకి 1992 లో కేంద్ర సాహిత్య ఎకాడమీ అవార్డు వచ్చినప్పుడు ఆసక్తి లేక నేను ఢిల్లీ వెళ్లి ఆ అవార్డు వ్యక్తిగతంగా తీసుకోలేదు. కానీ ఇవాళ మా వంగూరి చిట్టెన్ రాజు అమెరికా నుంచి వచ్చి, పదేళ్ళ క్రితం వచ్చిన ఆ బహుమతిని మళ్ళీ గుర్తిస్తూ సన్మానం చేస్తానంటే నాకు ఎంతో సంతోషంగా ఉంది. పైగా ఇంతమంది



అత్యంత ప్రతిభావంతులైన సాహిత్య స్రష్టలతో నేను ఒకే వేదికని పంచుకోవడం నా జీవితంలో చాలా అరుదైన అవకాశం.” అని నాకు ఎనలేని గౌరవం చేసారు. ఆవిడ ప్రస్తావించిన సాహితీ స్రష్టలైన చేకూరి రామారావు, అబ్బూరి ఛాయా దేవి, కేతు విశ్వనాథ రెడ్డి , కాళీపట్నం రామారావు, మాలతీ చందూర్ గారికి ఒక పక్కన, రెండో పక్కన కె. శివారెడ్డి, ఇటీవలి “జ్ఞానపీఠ్” బహుమతి గ్రహీత రావూరి భరద్వాజ, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, మరొక “జ్ఞానపీఠ్” బహుమతి గ్రహీత సి. నారాయణ రెడ్డి గారు, ఎన్. గోపీ, గొల్లపూడి మారుతీ రావు, జొన్నవిత్తుల, ద్వానా శాస్త్రి లతో మధ్యలో భయం, భయంగా నేను, వంశీ రామరాజు గారు ఉన్న ఫోటో ఇందుతో జతపరుస్తున్నాను. ఈ ఫోటోలో నారాయణ రెడ్డి గారు ఆవిష్కరిస్తున్న పుస్తకం నా “అమెరి’కాకమ్మ’ కథలు” అనే విషయం నా సొంత సుత్తి. మాలతీ చందూర్ గారిని నేను చూడడం అదే ఆఖరి సారి. కానీ మాట్లాడడం కాదు.

2012 , మార్చ లో మేము హ్యూస్టన్ లో నిర్వహించిన మూడవ ప్రపంచ సాహితీ సదస్సుకి ఏమైనా సరే మాలతీ చందూర్ గారిని ప్రధాన అతిథిగా అమెరికా తీసుకు రావాలని కృత నిశ్చయంతో నేను పదే, పదే పిలిచి, యార్లగడ్డ గారు, గొల్లపూడి గారు మొదలైన వారితో రికమండేషన్స్ చేయించాను. వాటి ఫలితంగా ఆవిడ అమెరికా రావడానికి ఒప్పుకున్నారు కానీ తన కూడా కనీసం మరొకరు ఉండాలనీ, పాస్ పోర్ట్, వీసా, ప్రయాణం ఏర్పాట్లు అన్నీ నేనే స్వయంగా చూసుకోవాలనీ, ఇంకెవరినీ నమ్మను అనీ, సభ జరిగే రోజులు తప్ప ఇంక ఎక్కువ రోజులు ఉండను అనీ, ఇంకే ఊళ్ళూ వెళ్ళనూ అంటూ షరతులు పెట్టారు. వాటిల్లో నేను సిద్దపడ్డా సమయాభావం వలన మాలతీ చందూర్ గారిని అమెరికా రప్పించే నా ప్రయత్నం విరమించుకున్నాను. అవన్నీ ఇప్పుడు తల్చుకుంటే ఒక మంచి అవకాశం ఆవిడా, మేమూ కూడా కోల్పోయామేమో అనిపిస్తోంది.

ఇక నాకూ, మాలతీ చందూర్ గారికీ నక్కకీ నాకలోకానికీ ఉన్నంత దూరం ఉన్నా యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ గారు నిర్వహించే లోక్ నాయక్ ఫౌండేషన్ వారు క్రిందటి సంవత్సరం (2012) లో నాకు ఆ సంస్థ వారి ప్రతిష్టాత్మక లిటరరీ అవార్డు ప్రకటించ గానే 2005 లో మొట్ట మొదటి సారి ఆ అవార్డు మాలతీ చందూర్ గారికి, ఎన్. ఆర్. చందూర్ గారికి దక్కింది అని తెలిసింది. అది వినగానే, అలాంటి గొప్ప వారికి వారికి ఇచ్చిన బహుమతికి సాధారణ రచయితని అయిన నాకు అర్హత లేదేమో అనిపించి సిగ్గు, భయమూ వేసి ఏం

చెయ్యాలో తెలియక సలహా కోసం మాలతీ చందూర్ గారినే పిలిచాను. విషయం చెప్పగానే “యార్లగడ్డ కి అన్నీ తెలుసు. తప్పకుండా ఎవార్డు తీసుకో” అన్నారు. పారితోషికం లక్షా పాతిక వేలు అని తెలియగానే “లక్కీ ఫేలోవి. మాకు లక్షతో సరిపెట్టాడు” అని సంతోషపడ్డారు మాలతీ చందూర్ గారు. అదే నేను ఆవిడతో ఆఖరి సారి మాట్లాడడం.

ఎస్.ఎస్. ఎల్.సి...అనగా హై స్కూల్ దాకానే చదువుకుని, కేవలం స్వయంకృషితో, మామయ్యా & భర్త నాగేశ్వర రావు చందూరి గారి అపూర్వ సహకారంతో, కంప్యూటరూ, గూగులూ లాంటి సౌకర్యాలు ఏ కోశానా లేని రోజుల్లో, భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక వేగంగా మార్పులు చెందుతున్న తెలుగు సామాజిక వ్యవస్థకి, ముఖ్యంగా మహిళల అనేక పాత, కొత్త సమస్యలకి “నేనున్నాను” అంటూ పరిష్కారాలు సూచించి, వెన్నుతట్టి కోట్లాది తెలుగు హృదయాలలో వెలుగు నింపి, వారి జీవితాలకి దిశా నిర్దేశం చేసి తన పార్థివ శరీరాన్ని సైతం వైద్య పరిశోధనల నిమిత్తం అంకితం చేసి పరిపూర్ణమైన జీవితాన్ని పునీతం చేసుకున్న ఏకైక సాహితీ వేత్త మాలతీ చందూర్ గారితో నాకున్న పరిమిత పరిచయాన్ని నెమరువేసుకుని నివాళులు అర్పించడం కన్నా నా బోటి వాడు చెయ్యగలిగినది ఏముంది?




మా బ్లాగ్: www.vangurifoundation.blogspot.com

COMMENTS